IJMRT: Volume (1), Issue 1, March 2019

ISSN (Print) : 2663-2381
ISSN(Online) : 2663-4007

International Journal of Multidisciplinary Research Transactions

(A Peer Reviewed Journal)

www.ijmrt.in

# అద్దంకి గంగాధర కవి - తపతీసంవరణము

**డా. మొరంగపల్లి పద్మకుమారి***

*అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు, బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల, బేగంపేట, హైదరాబాద్.*

*Corresponding author

---

తపతీ సంవరణ ప్రబంధ రచయిత అద్దంకి గంగాధరకవి. ఇతని తండ్రి పేరు వీరయామాత్యుడు. గురువు కేదారశ్రీ గురువర్యులు. దీక్షా సాహిత్యముల రెంటిని నేర్పిన గురువు ఈయనే. స్వగ్రామము నెల్లూరు మండలము నందలి అద్దంకి. గంగాధరువి తండ్రి కాలమునవో, తాత కాలమునవో గోలకొండ ప్రాంతమునకు తరలివచ్చి స్థిరపడి వుండవచ్చును.

కృతాపతి ఇబ్రహీమ్, తండ్రి కుతుబ్-ఉల్-ముల్క్. ఇతడు తూర్పు భారతదేశమున కొంతభాగమును ఓఢ్రులను గెలుచుకొన్నట్లు 'గూడూరు' శాసనమున తెలుపబడినది. నెల్లూరు మండలములోని కొంతభాగమును కుతుబ్‌షాహీల పాలనలోనున్నప్పుడు గంగాధరుని తండ్రి వీరయామాత్యుడు వారినాశ్రయించి కొలువు సంపాదించి యుండవచ్చును. తండ్రి సహాయముతో గంగాధర కవి కూడ సుల్తానుల అస్థానములో ప్రవేశించి యుండును. గరాధర కవి తొల్దులుత కుతుబ్-ఉల్-ముల్క్ అనంతరము రాజ్యపాలన చేస్తున్న 'జంషీద్' కొలువులో వున్నట్లు ఒక సీసపద్యమును బట్టి తెలియుచున్నది.

జంషీద్ అనేవాడు కుతుబ్-ఉల్-ముల్క్ కుమారుడు. ఇతడ తండ్రిని సంహరించి, సోదరుడైన 'హైదరు ఖాను'ను ఖైదును చేసి నిజాం గద్దెనెక్కినాడు. ఇతనికి భయపడి ఇబ్రహీం విజయనగరమునకు పారిపోయినాడు. విజయనగర రాజ్యాధిపతి 'అలియరామరాజు'ను శరణుజొచ్చినాడు. జంషీద్ పరిపాలించినంత కాలము అనగా క్రీ.శ. 1543 నుండి క్రీ.శ.1550 వరకు 7 సంవత్సరములు విజయనగరముననే యున్నాడు. విజయనగరమున వున్నంత కాలము అక్కడే పండితులవల్ల రాజ నీత్యాది శాస్త్రములను, సంస్కృతాంధ్ర భాషలను, సాహిత్యములను నేర్చుకొన్నాడు. విజయనగర రాజుల ఉత్తమాదర్శములను అలవర్చుకొన్నాడు.

క్రీశ. 1550లో జంషీద్ మరణానంతరము "ఇబ్రహీం" గోలకొండ రాజ్యాధిపతి అయినాడు. ఇతడు హిందూ ముస్లింలను సమదృష్టితో చూసేవాడు. తెలుగు ఉర్దూభాషలను సమాధరించినాడు. "భాగీరథీ" అను హిందూ యువతిని వివాహమాడి గోలకొండకు "భాగీరథీ పట్టణమ"ని నామకరణము

చేసినాడు. భాగీరథీ వలన కులీకుతుబ్–షా జన్మించినట్లు 'గులామ్ హుసేన్ ఖాన్‌జోహర్', 'మహ్‌నామా' అను అముద్రిత పారశీ గ్రంథమునందున్నది. డా॥ బిరుదురాజు గారు 'కుతుబ్–షాహీ–సుల్తానులు–ఆంధ్ర సంస్కృతి' అను పుస్తకమునందు తెల్పియున్నారు. తండ్రి మార్గముననుసరించి కులీకుతుబ్‌షా 'భాగామతి' అను హిందూయువతిని పెండ్లియాడి భాగ్యనగరమును నిర్మించినాడు.

తెలుగు భాషను నేర్చుకొని, తెలుగు కవిత్వమును ఆస్వాదించగలవాడగుటచే పలువురు తెలుగు కవులు ఇబ్రహీమ్‌ను దర్శించి తమ కవితాపాటవమును ప్రదర్శించుచుండిరి. ఇతనిని తెలుగువారు 'ఇభ రాముడు' అని పిలుచుచుండిరి. ఇభరాముని కవిపండిత పోషణత్వమును గురించి 'సారస్వత సారస్య విచార స్తుతమతి కవీంద్ర సన్నుత మూర్తి', 'హిందూరామ విభాళ సత్కవిమణి బృందావన ప్రక్రియా మందార ద్రుమ', 'ప్రతివారస్తుత సారస్వత ధీర ప్రణుత విజయ చారిత్రునకున్' అని గంగాధర కవి కొనియాడినాడు. ఇభరాముడు ఇస్లాం మతస్థుడైన హైందవ పురాణేతిహాసముల పట్ల ఆసక్తిని చూపుచుండెడివాడు.

ఒకనాడు ఇభరాముడు ఆస్థానమునందు ఆసీనుడైయున్న తరుణమున గంగాధర కవిని పిలువనంపి అతనితో....

**"పెక్కు కృతుల్ చమత్కృతులు బెంపుగ నందితిఁగాని నీదు స**
**మ్యక్కృతి కన్యపై, గల మమత్వము వర్తిలదందు; లెక్కకుం**
**బెక్కువగాఁగ గోపికలు మించి వసించిన నేమి రాధపై**
**మక్కువ యెక్కువై మిగుల మన్నన సేయడె శౌరి వేడుకన్"**

**"అట్లు గావున భారతాఖ్యాన మందుఁ**
**గలుగు తాపత్య చరితంబు ఘనత నరసి**
**వివిధ శృంగార మహిమలు విస్తరించి**
**కబ్బమొనరింపు నాపేరఁ గవివరేణ్య"**

అని కర్పూర తాంబూలమిచ్చి తపతీ సంవరణమును తన కంకితముగా వ్రాయుమని కోరినాడు. భారతమునందలి తపతీసంవరణుల మూలకథను గ్రహించి తనకు, భాగీరథికి మధ్య నడచిన శృంగార గాథను నిర్మింపుమని గంగాధర కవిని కోరినాడు.

తపతీ సంవరణము శ్రీకృష్ణదేవరాయల కాలమున వెలువడిన మను, వసు చరిత్రాది ప్రబంధ పరంపరననుసరించి వ్రాసినట్లుగా భావింప వచ్చును. నలోపాఖ్యానములోని హంసి రాయబారమును

తలపింపజేయు చిలుక రాయబారము కలదు.

తపతీ సంవరణోపాఖ్యానమనబడు మహాభారత ఉపాఖ్యానము, భారతమునందు ఆదిపర్వములోని సప్తమాశ్వాసములో 23 పద్యగద్యములలో నన్నయచే చిత్రీకరించబడినది. దానిని గంగాధర కవి సుమారు 500 పద్య గద్యములలో, ఏడాశ్వాసములుగా, వివిధ దర్శనలతో ప్రబంధీకరించినాడు.

సూర్యునకు సావిత్రి, తపతియను యిద్దరు కుమార్తెలు. తపతి యౌవనవతి అయిన వెంటనే ఆమెకు తగిని వరుని గురించి ఆలోచింప సాగినాడు సూర్యుడు. భూలోకమున సూర్యునికై తపమాచరించుచున్నా భరతవంశపు రాజు సంవరణుడు తపతికి తగిన పతియని సూర్యుడు నిశ్చయించుకొన్నాడు. ఈ కథను అర్జునుడడుగగా అంగారపర్ణుడను గంధర్వుడు చెప్పినాడు.

ఒకనాడు భరతవంశపు రాజైన సంవరణుడు వేటాడి అలసిపోయి ఒక పర్వత ప్రదేశమును చేరినాడు. అచట ఒక కన్యను జూచి, ఆమె సౌందర్యమునకు అబ్బురపడినాడు. కనకప్రభలను వెదజల్లుతున్న ఆమె శరీరకాంతిని, చంద్రబింబము వంటి ముఖారవిందమును వివశుడైనాడు. “ఒంటరిగా తిరుగాడు నీవెవరిదానవు? ఎందులకేతెంచినావని ప్రశ్నించిన సంవరణునకు సమాధాన మీయకనే యాకన్య యదృశ్యురాలైనది. తపతి కొరకు నేలపై బడి విలపించుచున్నా సంవరణుని దీనత్వమునకు జాలిపడి తిరిగి ప్రత్యక్షమైనది. అతని వృత్తాంతమును తెలుసుకొని, తన వృత్తాంతమును దెల్పి సూర్యునారాధించి తనను పొందుమని చెప్పి సూర్యలోకమునకు వెళ్ళినది.

‘తపతిని గానక సంవరణుడు మూర్ఛితుడైనాడు. సంవరణుని అమాత్యుడు వచ్చి శీతలోపచారములు చేసి మూర్ఛతేర్చెను. సంవరణుడు ఆ పర్వతమునందే యుండి సూర్యునారాధించుచు, తన పురోహితుని (వసిష్ఠుని) స్మరించుకొనెను. వసిష్ఠుడు వచ్చి కృశించియున్న రాజును జూచి యోగదృష్టితో సూర్యసుతమైన తపతి యందు అనురాగ బద్ధుడైనట్లు తెలుసుకొన్నాడు. వెంటనే సూర్యలోకమునకు పోయినాడు. నిముషమునకు మూడు వందల అరవైనాలుగు యోజనముల వేగముతో పరిభ్రమించుచున్న సూర్యుని స్తుతించి, సంవరణునకు తపతిపై గల ప్రేమను దెల్పినాడు. సూర్యుడు సంతోషించి తపలిని వసిష్ఠుని వెంట పంపెను. వసిష్ఠుడు సూర్యుని రథముపై తపతిని భూలోకమునకు తీసుకొని వచ్చి సంవరణునకిచ్చి పెండ్లిచేసెను.

సంవరణుడు ఆమెతో భోగములననుభవించుచు రాజ్యమును, రాజకార్యములను విడిచిపెట్టి ఆ పర్వతారణ్యములందే పంద్రెండు సంవత్సరములు గడిపెను. రాజులేని (హస్తినాపురము) రాజ్యము అనావృష్టి పాలయ్యెను. వసిష్ఠుడు శాంతి పౌష్టిక క్రియలొనరించి సంవరణుని హస్తినకు తోడ్కొనివచ్చెను.

సంవరణుడు రాచకార్యములందు ఆసక్తితోనుండి పరిపాలింపసాగెను. అతనికి తపతియందు వంశకరుడైన 'కురువు' జన్మించెను.

మహాభారతమునందలి తపతీ సంవరణుల ఉపాఖ్యానమును గంగాధర కవి తన కల్పనా చమత్కృతితో పలువిధములుగ పెంచి ప్రబంధీకరించెను. (i) చిలుక రాయబారము. (ii) శ్యేనమయూరముల పోరాటము (iii) తపతి చెలికత్తెలు (iv) అరుంధతి ప్రవేశము (v) ఇతర వర్ణనములు. మొదలగు పలు వర్ణనలతో నినుమడింపజేసి రమణీయమైన ప్రబంధమును తయారుచేసినాడు.

నలోపాఖ్యానము నందలి నలదమయంతుల నడుమ ప్రేమాయణమును నడిపిన హంస రాయబారము ననుసరించి చిలుక రామబారము గంగాధర కవి కల్పనలలో ప్రధానమైనది. మిగిలినవన్నీయు సంబంధించిన ఉపవర్ణనలు.

నల దమయంతుల కథా ప్రభావము తపతీ సంవరణుల ప్రణయ కథకు ఆధారమనిపించును. ఈ ప్రబంధములో చిలుక నాయికా నాయకులకు పరస్పర సౌందర్యములను వర్ణించి, పరస్పర ప్రణయమునకు మార్గము వేసినది. ఈ చిలుక మగ చిలుక. తపతికి ప్రియ శిష్యుడు, ఆమె వద్ద అన్ని విద్యలను నేర్చుకొని, గురుదక్షిణగా యోగ్యుడైన భర్తను వెదకు బాధ్యతను స్వీకరించి అన్ని దేశములను తిరిగి చివరకు సంవరణుడున్న ప్రదేశమునకు వచ్చినది. సంవరణుడే తపలికి తగిన భర్తయని నిశ్చయించినది.

చిలుక పలుకులతో తపతిపై మరులుగొన్న సంవరణుడు సూర్యుని మెప్పించి సూర్యసుతను పొందగోరెను. మూలమున సంవరణుని సూర్యారాధనకు సరియైన కారణము కప్పింపదు. గంగాధరుడు చిలుకను పంపించి సంవరణుని సూర్యారాధనకు ప్రేరణ కల్పించెను. సంవరణుని ఉపాసనకు సంతుష్టుడైన సూర్యుడు తన పుత్రినిచ్చుటకు నిశ్చయించుకొనెను. చిలుక ప్రవేశముతో ఉభయుల మనోరథములు సఫలమైనవి. ఈ ప్రబంధమునకు ప్రాణప్రదమైన చిలుక రాయబారమునకు ఇభరాముని కోరికయే కారణము. "వివిధ శృంగార మహిమల విస్తరించి కబ్బమొనరింపు నా పేరఁ గవివరేణ్య" అని కోరిన మాట గుర్తుకు వచ్చును. ఆయన కోరిక మేరకు తపతీసంవరణుల శృంగారమునకు పూర్వాను రాగరూపమైన 'వినుకలి వలపు' కల్పింపబడినది.

గుణ శ్రవణ, స్వప్నాది దర్శనముల వలన నాయికానాయకులకు జనించు ప్రేమ పూర్వాను రాగమై యొప్పును. అది సంగమమునకు పూర్వము జనించి, వర్ధిల్లును. కవి దీనిని సమయోచితముగా కల్పించి, ప్రయోజనవంతముగా నిర్వహించినాడు.

**"యత్ప్రేమ సంగమాత్పూర్వం దర్శన శ్రవణోద్భవం**

**పూర్వాను రాగ స్సవిజేయః శ్రవణం తద్గుణ శ్రుతిః**
**ప్రత్యక్ష స్వప్న చిత్రాదౌ దర్శనం దర్శనం స్మృతం"**

అను ఆలంకారిక వచనము దీనిని నిరూపించుచున్నది. సూర్యోపాసనతో మూలకథ ఆరంభమైనది. గంగాధర కవి శృంగార రస ప్రధానమైన కావ్యమున కనువుగా సంవరణుడు ఉద్యాన వన సందర్శనము, సంవరణుని బల పరాక్రమ గుణరూపాదులతో ప్రారంభించినాడు.

ఉద్యానవనమున విహరించుచున్న సంవరణుడు వృక్షలతాదుల నడుమ వసంతుని వలెనున్నట్లు చెప్పినాడు. లతలనెడి నాయికల విలాసచేష్టలచే తరువులనెడు నాయకులు అనుభావ సాత్విక భావములను ప్రకటించుచున్నట్లు. సంవరణుడు భావించినాడు.

నవ్య వసంతునివలె కనబడుతున్న రాజునకు వనలక్ష్మి అపరంజి పాత్రలో దానిమ్మ పండ్లనుంచి ఆరతులీయగా, రాజు చెలువునకు వెఱచిన మన్మథుడు సుమసాయకములను జాఱవిడిచినట్లు మలయానిల తాకిడికి పూలు జలజల రాలెను. ఇచట కవి ఉత్ప్రేక్షను కమనీయముగా కనుల ముందుంచినాడు

నవరసాలము వలె ప్రవేశించిన రాజునకు మహారసాలముపై చిలుక ఒకటి కనబడినది. ఈ రసాలము తపతీ సంవరణుల పెండ్లిముచ్చట మాట్లాడుటకు రంగస్థలమైనది. ఆ మెలమావి "ఈరేడు జగముల నాక్రమించి విశ్వరూపము గైకొన్న విష్ణు కరణి" వ్యాపించి యున్నది. కుతూహలముట్టివడ ఆ మావిని సమీపించి చంద్రకాంత శిలాతలమున ఉపవిష్టుడైనాడు. సంవరణుని మణిబంధమునకున్న మాణిక్యములు పొదిగిన స్వర్ణకంకణమును దాడిమ ఫలముగ భావించిన ఆ రాజకీరము రాజు మణికట్టుపై వ్రాలినది.

కం॥ **ఘృణి శాలి కంకణారుణ**
**మణి పంక్తింగాంచి దాడిమ ఫలాశను ద**
**న్మణి బంధముపై వ్రాలెను**
**బ్రణుతించుచు నొక్క చిలుక పటు వేగమునన్**

మాణిక్యములు పొదిగిన స్వర్ణకంకణమును దాడిమ ఫలముగ భ్రాంతిపడినట్లు వర్ణించిన గంగాధరుని కల్పనా చమత్కారము మెచ్చదగినది. వచ్చిన రాచిలుక చిత్రమైన వర్ణము కలిగియున్న దివ్య రాజు కీరము. సంవరణుడు ఆ రాజ కీరమును నిర్నిమిషుడయి తేరి చూచెను. ఆ నిర్నిమిషత్వము దివ్యమైన తపతిని వివాహము జేసికొనబోవు సంవరణునకు దివ్యత్వమబ్బినది. తపతికి గురుదక్షిణగా తగిన భర్తను వెదక బయలుదేరిన రాచిలుకకు సంవరణుడు సరియగు జోడీ యని నిర్ణయించి

తపతి సౌందర్యమును వర్ణించి చెప్పినది. తపతి వద్దకు జేరి సంవరణుని సౌందర్యమును వర్ణించి ఇరువురకు ఇరువురకు పరస్పర ప్రేమను మొలకెత్తించుటకు ఆస్కారమై యొప్పుచున్నది.)

తపతి ముఖసౌందర్యమును గురించి సంవరణుని వద్ద వివరించినపుడు ఈ క్రింది విధముగా రాచిలుక వర్ణించినది.

**చం॥ కమలము పూర్ణచంద్రముడు కాంతిఝరైక విధానులయ్యు నీ**
**రమణి మొగంబు చెల్పునఁ బరాజయ మందుట సిద్ధమిప్పుడుం**
**దమకుఁ బరస్పరంబు ముఖ దర్శన మబ్బిన వేళఁ దమ్మి వే**
**గమె ముకుళించుఁ జందురుండు గందు మనంబున సిగ్గుదేఱగన్**

**గీ॥ చక్కదనమున నా సరోజాత గంధి**
**పాటి కలకంతి లేదని పద్మ భవుడు**
**వ్రాయు లిపి కాస్పదంబదే వనిత నుదురు**
**వేఱె యడుగంగ నేల తద్విభవ లీల**

అని తపతి ముఖము కమలము వలె సౌందర్యముగను, చంద్రుని వలె కళంకముతో గాక కళంకరహితమై కాంతిమంతముగా నున్నది. ఇటువంటి సుందరమైన ముఖారవిందమును గాంచిన తమ్మి ముకుళించుకొని పోతుండు చంద్రుడు మనస్సులో సిగ్గుపడి వ్యధచెందుతాడు. ఇంతటి అందగత్తెను అందమైన పంచవన్నెల చిలుక ఆహ్లాదకర పలుకులు వినసొంపైనవి.

**కం॥ చిలుకల పలుకులు రసములు**
**చిలుకును భువినెట్టి వారి చెవులకుఁ జవులై**
**చిలుకల కొలికి ప్రసంగము**
**చిలుక ప్రసంసించెనేని, జెప్పగనేలా?**

కవి చిలుకను, చిలుకల కొలికిని వర్ణించి ఔచిత్యమును ఇనుమడింప జేసినాడు. గంగాధరుడు ప్రణయగాథను వర్ణించినప్పుడు నలదమయంతుల రాయబారియైన మంపిని దృష్టియందుంచుకొన్నాడని అన్పింపకమానదు.

అమృత తుల్యములైన రాచిలుక పలుకులు విని రాజు మిగుల ప్రసన్నుడైనాడు. రాజు రాచిలుకను ప్రశంసించినపుడు అది చెవియొగ్గి విని మనుష్య భాషలో తపతి సౌందర్యమును వివరించిన తీరు అబ్బుర పఱుచునదిగానున్నది.

**"బంగారు మయమైన బ్రహ్మాండ భాండంబు**

**మెఱుగిడు నెవ్వాని మేని ఛాయ"**

అని మొదలుపెట్టి ముఖచంద్రము, నెలవంక నుదురు మొదలగు అంగాంగ వర్ణనలను సుమారు 26 పద్యములలో వర్ణించినది. సంవరణుని మనస్సున మన్మథ కలతలు రేపినది.

ఎందఱో రాజులను జూచిన ఆ రాచిలుక యెవ్వరి యెదుటను తపతి సౌందర్యమును వర్ణించలేదు. సంవరణుని జూచిన వెంటనే తపతికి తగిన పతి యనే భావన కలిగినది. కవి తనకు మారుగా సృష్టించినాడు. ఆ చిలుకయందు తన స్వానుభవములను ఆపాదించినాడు. కాబట్టే చిలుక పాత్రను పకడ్బందీగా గడుసరిగా తీర్చిదిద్దినాడు.

**"వాచా వధూ విడంబిని**

**యా చారుకటీ రథాంగ యా సకల కళా**

**వైచిత్రిని గావున నా**

**కాచార్యత్వము వహించెనయ్య మహీంద్రా!"**

తపతి వద్ద తాను నేర్చిన విద్యల నన్నింటిని సంవరణునకు దెలియ పర్చినది. పలు భాషలలో పలుకగల నేర్పు వున్న తనకు ఆంధ్రమొక లెక్కలోనిది కాదని చెప్పినది. ఇచట గంగాధరుని పాండితీగరిమ స్ఫురింపకమానదు చిలుక గురుభక్తి నందు గంగాధరుని గురుత్వము స్ఫురించును.)

తపతి సౌదర్యమును వినిన సంవరణుడు దివ్యమైన తపతికి మర్త్యుడయిన తనకు వివాహయోగం బసాధ్యమని చింతించుచున్నాడు. అతనికి చిలుక ధైర్యవననములు చెప్పిన తీరు చూచినచో ఆహాయన్పించును. "దైవయోగమున్నచో ఎట్టి దుర్ఘరకు కార్యములైనను జరుగునని" అభయమిచ్చినది. దేశదేశములు దిరిగిన ఆ చిలుక సంవర యుధ్యాన వనమున వ్రాలుటయే దైవయోగమునకు తొలిమెట్టయిన దైవగతం. అంతరిక్షమున గల చంద్రునకు భువి కలువకు ఎంతో దూరము. అయినా వారికి సంయోగము కలుగలేదా?

**"జలజదళ నేత్ర రెండవ చంద్రరేఖ**

**ధరణి తలమున రాజశేఖరుడ వీవు**

**ఇంతకన్నను విధియోగమేమి కలదు"**

ఒక చంద్రరేఖ కైలాసమున రాజశేఖరుని జేరినది. రెండవ చంద్ర రేఖయైన తపతి భూలోక రాజశేఖరుడవైన నిన్ను చేరక తీరదు. ఇది దైవ యోగము. ఈ సందర్భమున రాచిలుక పలికిన పలుకులు సంవరణునకు ఊరట కలిగించి, తపతికై ఆశలు కల్పించినది. దైవభక్తిని పెంపొందించు

శివప్రస్తావనను చిలుక ద్వారా ప్రకటించినాడు. తపతిని మరికొంత వర్ణించి రాజు అభిలాషకు ప్రాణంపోసినది. సూర్యోపాసన జేయుమని గుర్తుజేసి సూర్యమండలానికి వెళ్ళిపోయినది.

చిలుక సూర్యమండలమునకు చేరి తపతి చేతిమీద వ్రాలినది. ఇంతకాలమెచటికేగి ఆవని అడిగిన తపతికిట్లు సమాధాన మిచ్చుచున్నది.

**"అరిగితా నా సముద్ర వలయావనిఁ గూర్చి, తదనంతరంబునం**
**దిరిగితిఁ బెక్కు దేశములు, ద్రిమ్మరితిన్, బహు పట్టణావళుల్**
**వరుసఁ బసిండి కొండ వలవంకను, నేరెడు దీవిలోపలం**
**గరిపుర మేలుచున్న మహికాంతుని రాజు కుమారునిఁ గాంచితిన్"**

అంధునకు దివ్యదృష్టి గలిగిన విధంబున ఊరటిల్లిన యా చిలుక రాజము యెలమావి ఛాయమందలి సంభాషణలను వివరించినది.

**"అతని రూపము గనుగొన్న యబ్జముఖులు**
**కడక నీతిని వరియించు కన్య ధన్య**
**యనుచుఁ దమలోన పరియింప నవ్విభునకు**
**సంవరణ నామధేయంబు సఫలమయ్యె"**

**"బంగరునఁ దావి యమరిన**
**భంగిం, జెఱకునకుఁ బండు పండిన లీలన్**
**శృంగార వంతుడగు న**
**య్యంగ భవస్పర్థి మేన యౌవన మొదవెన్"**

సంవరణునకు బంగారునకు తావి యబ్బినట్లు యౌవన మరుదెంచినది. చెఱుకునకు పండిన పండువలె సంవరుణుని యౌవనము మధురముగనున్నది. సంవరణుని ఏకన్య భర్తగా పొందుతుందో ఆమె ధన్య అని ముందుగానే స్త్రీ మనస్సు వశము చేసుకొనే మాటలు చెప్పి, ఆ తర్వాత సంవరణుని రూపసంపదలను వర్ణించింది.

**సీ॥ "ఆ సంవరణు రూపమరసి జయంతుండు**
**నివ్వెఱ గంది నిర్నిమిషఁ డయ్యె**
**నా కుమారుని యాకార మీక్షించి**
**వెలవెల బాఱె నా కలువ ఱేడు**

**అక్కుంభినీజాని చక్కందనముఁ జూచి**
**విగ్రహంబుడిగెఁ బూవింటివాడు**
**ఆ వారి గంభీరు లావణ్యమును గాంచి**
**నలకూబరుడు చాల నలుక బూనె"**

గీ॥ **"సహహ! యీరేడు లోకంబులందు గలుగు**
**సకల లావణ్య రసమెల్ల సంగ్రహించి**
**గరిమ నారాజు గా వింపఁ గరువు గట్టి**
**చేసెఁగాబోలు నేర్పుతో సృష్టికర్త"**

సంవరణుని సౌందర్యము జయంతుని సౌందర్యమును మించినదని, రూపలావణ్యములలో చంద్రుడు. మన్మథుడు, నలకూబరులు బలాదూరని తపతితో చెప్పింది.

తపతీ సంవరణుల రూపలావణ్య సంపదలను రాచిలుక వల్ల ఇరువురకు తెలియపర్చి పూర్వానురాగ మేర్పర్చుటకు చిలుక చమత్కృతి, వాక్చాతుర్యము తోడ్పడినది.

తపతికి కాలయాపన చేయుటకు చెలికత్తెలు, ఆమెతోకూడి భూలోకమునకు వచ్చిరి. వసంతర్తువు అటదెంచెను. చెలికత్తెలు పుష్పాపచమము చేయుచుండిరి. తపతి మాత్రము చింతాక్రాంతయై యుండెను. చెలికత్తెలు జలక్రీడలొనరించి, అలంకరించుకొని చంద్రకాంత శిలాతలముపై మదనుని ఆవాహనజేసి ప్రార్థించిరి.

సంవరణుడు సూర్యోదయముననే లేచి ఉచిత పరివారముతో వేటకు బయలుదేరెను. కొంతసేపు వేటాడి వనమునంతను దిరుగు చుండెను. ఆమిష భక్షణార్థమై యొక వనమయూరమక్కడకు వచ్చెను. దాని పట్టుకొనుటకు సంవరణుడొక సాళువమును బంపెను. నెమలి తప్పించుకొని పారిపోగా సాళువము దానిని వెంబడించెను. రాజు గుర్రముపై వానిననుసరించుచూ చాల దూరము పోయెను. కొంతసేపటికి మయూర శ్యేనముల జాడతెలియలేదు. గుర్రము అలసిపోవుటతో పాదచారియై తపతియు, చెలికత్తెలును వున్న వనమునకు చేరెను. ఆ దివ్యకాంతల సౌందర్యములను గాంచిన రాజు నవరత్నములలో వజ్రమువలె భాసించుచున్న తపతిని జూచెను. తన నిజరూపమును జూచినచో ఆ దివ్యకాంతలదృశ్యులగుదురేమోయని తలచి ఒక చెట్టు చాటున ఒదిగి వారి సౌందర్యములను చూచుచుండెను.

రాచిలుక చెప్పిన సౌందర్య గుణములు కలిగిన సుందరాంగి తపతి యీమెయేయగునని

తలచి తపతిని సమీపించెను. అతనిని చూచిన చెలికత్తెలందరు మాయమైరి. తపతి అతనిని జూచి చిలుక చెప్పిన రాకుమారుడితడేనని తలచి యోగమాయచే ఒకచోట నొదిగి యుండి సంవరణుని గమనించుచుండెను. సంవరణుడు తపతిని గూర్చి విలపించుచు పలుచోట్ల వెదకుచు నేలబడి పొరలుచుండెను.

**"ఏమిటికి విలాపించెదు**
**భూమి స్థలిమందుఁ బొరలి పొరలి? సరోజ**
**శ్రీముష్టింధయమగు నీ**
**మోమేటికి వాడె భువన మోహన రూపా!"**

తపతి సంవరణుని దీనావస్థకు జాలిపడి ప్రత్యక్షమై పశ్నించెను. రాచిలుక చెప్పిన సుందరాంగ వైననీవు కన్పించీ కన్పించక పోయేసరికి నా మనస్సు వ్యథ చెందినదని సమాధానమిచ్చినాడు.

**"నను గాంధర్వ వివాహం**
**బునఁ జేకొని పద్మకోటిఁ బురికొల్పెదు నీ**
**కనుసన్నల సకలంబును**
**కనుగొని కావింప నేలుకొనుము శుభాంగీ!"**

గంధర్వ పద్ధతిన వివాహం చేసుకొందమని తపతిని కోరినాడు. తండ్రి యానతి మీఱనని, సంవరణుని యీగిరి గుహాంతముననే జపతపోపవాసాదులచే సూర్యునారాధించి ప్రసన్నుని గావింపుమని చెప్పినది. తపతి సూర్యలోకానికి వెళ్ళిపోయినది. తపతి తాపమునకు తాళలేక మూర్ఛిల్లిన రాజు శీతలోపచారములచే సేదదీరి, సేనలను నగరమునకు బంపి తాను తపస్సు చేయనారంభించెను.

సంవరణుడు సూర్యోపాసన చేయు సందర్భములో గంగాధరుడు చెప్పిన పద్యము మనుచరిత్రలోని ప్రవరుడు హిమవన్నగమును జూచిన సందర్భమున అల్లసాని పెద్దన చెప్పిన పద్యమును తలపింపజేయుచున్నది.

**"అటజని గాంచె నా జనవరాగ్రణి యంబర చుంబికూటమున్**
**జటిల మునీశ్వర చారు తపోవన పుణ్య వాటమున్**
**స్ఫుటతర పద్మ కైవార విశోభిత కేలిసరః కృపీటమున్**
**గటుతర దుష్ప్రియా దురవగాహ కుంటము, రత్నకుంటమున్"**

తపస్సు చేయుచున్న సంచరణతి వద్దకు అరుంధతీ సమేతుడైన వసిష్ఠుడు వచ్చి, కఠోర తపమునకు కారణమడుగగా, రాజు పిరుపడి యోగదృష్టిత జాతిన మీకే తెలియునని చెప్పెను.

**"ముని నాథ యోగమార్గం**
**బున జూచిన మీ కగమ్యములు లేవటు గా**
**వున నా కోర్కులు మీకుం**
**బునరుక్తులు గానే చెప్పబూనుట యెల్లన్"**

యోగదృష్టిచే కారణము తెలుసుకున్న వసిష్టుడు "ఇంత మాత్రమునకు నీ తపంబేటికి? గోటనైన పనికి గొడ్డలేల? నెమ్మది గుంద నేమిటికి! నెమ్మది నుండుము వత్స!" మని యభయమిచ్చెను. ఆ సూర్యసుత నవలీలగ దెచ్చి నీ కల్పించెనని చెప్పి మహావేగమున సూర్యమండలమునకు వెళ్ళెను.

సతీసమేతుడై వచ్చిన వసిష్ఠుని జూచి సూర్యుడు భీతచిత్తుడై తమ్మిపూల సింహాసనమును దిగి వచ్చి కుశల ప్రశ్నలడిగెను. ఆ ముని వచ్చిన కారణమును చెప్పి తపతిని సంవరణునకిమ్మని కోరెను.

'నిగనిగని మించు మేని వన్నియల దానిఁ దపతియను కన్యఁ దారుణ్య ధన్యనపుడు తపసి చేతికీ నిచ్చెఁ బద్మ ప్రియుడు'.

తపతిని, తపతితో పాటు వస్తు సముదాయమును, గజచతురంగ వాహనములను, పరివార జనమును అరుంధతీ వసిష్ఠులతో పంపెను. దీనిని బట్టి గంగాధరుని కాలమున కూడ ఆడపిల్ల తల్లిదండ్రులు వస్తు, వాహనాదులను నిచ్చు ఆచారమెక్కువగా వ్యాప్తిలో నున్నట్లు తెలియుచున్నది. మూలమునలేని అరుంధతిని రప్పించి సతీసమేతుడైన వసిష్ఠుని సూర్యుని వద్దకు వెళ్ళి సంవరణునకు పిల్లనిమ్మని అడుగుటకు పంపిన తీరు గంగాధరుని కల్పనలకే తలమానికమైనది. సంప్రదాయబద్ధముగా నున్న యీ కల్పన భారతీయ సంప్రదాయమునకు ప్రతిబింబము.

తన ప్రతాపముచే లోకాలను గడగడలాడించు మూర్తాండుడు తపతిని అరుంధతీ వసిష్ఠులకు అప్పగించి "ఇక మీరే సుమా తల్లిదండ్రులని" చెప్పి కంటనీరు పెట్టుకొనుట సహజమైన కల్పన.

సూర్యసుతను తీసుకొని అరుంధతీ వసిష్ఠులిద్దరు భూలోకమునకు వచ్చి, శౌనకుడను శిష్యునిచే సంవరణునకు తెలియజేసినారు. హస్తినాపురమంతయు అలంకరింపబడి పెండ్లిశోభను కలిగించు చుండెను. అమాత్యాదులు రాజునెదుర్కొని హస్తినకు తోడ్కొని వచ్చిరి.

వసిష్ఠుడు పెండ్లిలగ్నము నిర్ణయించి రాజులందరికీ వివాహ ఆహ్వానములను పంపించెను. చెలికత్తెలు వధువును మంగళస్నానమాడించి అలంకరించిరి. ఉచితరీతిన నలంకరించుకొన్న రాజు వివాహమందిరమునకు వచ్చెను. వసిష్ఠుడు తపతిని సంవరణునకు ధారవోసి, వివాహం జరిపెను.

పెండ్లిపేటలపై వరుడు ఆసీనుడుగుట. పడతులు పన్నీరు చిలుకుట, వరుని కాళ్ళు కడిగి

కన్యాదానము చేయుట, గౌరీ కల్యాణమును నారీమణులు ఆరతులు పాడుట, తెరచిర చాటునున్న తపతి మోము, కందర్పుని సవ్యసాచిత్వము, వధూవరులు తలంబ్రాలు పోసుకొనుట, మంగళ సూత్రము కట్టుట, కొంగులు ముడివేయుట మొదలగు పెండ్లి తంతునంతటిని చతుష్ట దివసమున సాంగంబుగా కవి కాలములోని వివాహతంతు వర్ణింపబడినది.

పూర్వం పదహారు రోజులు పెండ్లి జరిగేదట. గంగాధరుని కాలమునాటికి నాలుగురోజులుగా నాలుగో వంతుకు తగ్గింది. నేడు ఒకరోజుకు కుదింపబడింది.

వివాహానంతరము వసిష్ఠుడు సంవరణునకు పదహారువేల బంగారు రథములను, ఆరు వేలమంది పరిచారికలను, కుండల కొద్ది గంధ సాంబ్రాణీ తేజులు లక్షలాది పెట్టెల నిండా చనిచోనాంబరములు అరణముగా ఇచ్చాను.

తపతీ సంవరణులు వివాహానంతరము మలయాంచలముపై చేరి విహరించుచు చాల సంవత్సరములు రాజ్యమును వీడి యుండెను. రాజ్యములో అనావృష్టి సంభవించి క్షామమేర్పడెను. వసిష్ఠుడు శాంతివిధాలు చేసి, సదుపదేశముజేసి రాజ్యమును పాలింపుమని హస్తినకు తీసుకు వచ్చెను. సంవరణుడు హస్తినను సుభిక్షముగా పాలించు చుండెను. తపతి గర్భము ధరించి శుభలగ్నమున పుత్రుని గాంచెను. ఆ పుత్రుడు దినదిన ప్రవర్ధమానముగా వర్ధిల్లి యౌవన ప్రాప్తుడయ్యెను. అతనికి యువరాజ్య పట్టాభిషిక్తుని జేసి, రాజ్యభార మప్పగించెను.

కవి భాగీరథి ఇబ్రహీంల ప్రేమకథను అంతర్గతముచేసి వివిధ వర్ణనలతో, అమూలక కల్పనలతో నింపి చక్కని ప్రబంధమును రచించెను.

**ఆధార గ్రంథాలు**

1. గోలకొండ కవి పండితుల సంచిక – సురవరం ప్రతాపరెడ్డి, డిసెంబర్ 1934.

2. ప్రస్తావన గోలకొండ సంచిక.

తెలంగాణ జాగృతి ప్రచురణ, మార్చి 2009, పుట. xviii

3. వైతాళికులు – ముద్దుకృష్ణ (సంపాదకుడు)